క్లుప్తంగా

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఆలయ అభివృద్ధి పనులకు విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధి పనులకు విశాఖపట్నానికి చెందిన వి.అర్జునరావు-వెంకట పద్మ దంపతులు రూ.10,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతలకు ఈవో స్వామి చిత్రపటం అందించారు.

ఏపీ ఫైబర్‌నెట్ సర్వీసులకు అంతరాయం

మలికిపురం: మండలంలోని ఏఈపీ ఫైబర్ నెట్ సర్వీసులకు మూడురోజుల పాటు అంతరాయం ఉంటుందని మండల కేబుల్ ఆపరేటర్ల ఎంఎస్ఓ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మలికిపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గల ఏపీ ఫైబర్‌కు గల ఓఎల్‌టీ టెర్మినల్ కాలిపోయినందున నెట్ సిగ్నల్ సక్రమంగా లేదని కొత్త ఓఎల్‌టీ టెర్మినల్ ఏర్పాటు పనులు జరుగుతున్న కారణంగా ఈ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఎంఎస్ఓ కోరింది.

చలివేంద్రాలు ప్రారంభం

కొత్తపేట: ప్రస్తుత వేసవిలో ప్రముఖ దేవస్థానాలతో పాటు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు వేసవి చలివేంద్రాలు ద్వారా ప్రజల దాహార్తిని తీర్చాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. కొత్తపేట-రావులపాలెం ప్రధాన రహదారిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యాన శనివారం వేసవి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ వేసవి చలివేంద్రాన్ని ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఏనుగులమహల్ చిన్నవంతెన వద్ద ఏర్పాటు చేసిన మరో చలివేంద్రాన్ని జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ప్రారంభించారు. ముందుగా దేవస్థాన ఈఓ సింగం రాధ ఆధ్వర్యంలో అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, వేదపండితుడు శర్మ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాల పంపిణీ

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈదరాడ సిద్ధార్థపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందించారు. స్కూల్ హెచ్ఎం షబ్బీర్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో వీటిని అందజేశారు. విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను మరింత మెరుగుపరచుకునే విధంగా ఉపాధ్యాయులు పేరెంట్స్‌కు తగిన సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో పీఎంసీ కమిటీ చైర్మన్ కుసుమ ప్రసాద్, ఉపాధ్యాయులు సర్కిల్ పఖర్ సాహెబ్, కడలి సూర్య చంద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మామిడికుదురు: నగరం గ్రామంలోని 216వ నంబర్ జాతీయ రహదారిపై కెనరా బ్యాంకు సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెదపట్నం అగ్రహారానికి చెందిన కాజులూరి దుర్గాప్రసాద్ (45) కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని నగరం ఎస్సై షేక్ జానీబాషా శనివారం తెలిపారు. మామిడికుదురు నుంచి బైక్‌పై శుక్రవారం ఇంటికి వెళుతున్న దుర్గాప్రసాద్‌ను వెనుక నుంచి పల్సర్ బైక్ బలంగా ఢీ కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. మొదట దుర్గాప్రసాద్‌ను అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆరోగ్యం విషమించడంతో అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా దుర్గాప్రసాద్ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి కొడుకు మణికంఠ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సత్యం ఎవరు చెప్పినా పాటించాలి

కొత్తపేట: కుల, మత, పేద, ధనిక అనే తేడా లేకుండా సత్యం ఎవరు మాట్లాడినా, చెప్పినా తప్పకుండా పాటించాలని హిందూ ధర్మ పరిరక్షణ రాష్ట్ర ప్రచారకుడు ముద్దు సాయిరాం అన్నారు. స్థానిక శ్రీరామనగర్ రామాలయం ప్రాంగణంలో శనివారం సమరసతాసేవ ఫౌండేషన్ జిల్లా సమావేశం జరిగింది. ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ వాశాడ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రచారకులు సాయిరాం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాయిరాం మాట్లాడుతూ హిందూ ధర్మం గురించి, దాని విశిష్టతను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ లక్ష్మి, సభ్యులు తొగర ఆంజనేయులు, కముజు వెంకటశివసుబ్రహ్మణ్యం, దూనబోయిన నాగేశ్వరరావు, దేవాలయాల ప్రచారకర్త మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

పి.గన్నవరం: గ్రామ సచివాలయ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ సర్పంచ్ బొండాడ నాగమణి ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం శనివారం నిరసన నిర్వహించారు. సొంత భవనాలు లేకపోవడం వల్ల నెలకు రూ.25 వేల అద్దె చెల్లించాల్సి వస్తుందన్నారు. తక్షణమే నిర్మాణంలో ఉన్న భవనాలను పూర్తి చేయాలని పాలకవర్గ సభ్యులు కోరారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

- రోడ్డుపైనే ధాన్యం రాశులు
- నిస్సహాయ స్థితిలో రైతులు

ఆలమూరు/కొత్తపేట: ఆరుగాలం శ్రమించి పండించిన పంట సరిగ్గా చేతికందే సమయానికి ముందు వేసవిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసి అన్నదాతలను కుదేలు చేస్తున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పుల వల్ల అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎప్పుడు వర్షం కురుస్తుందో, ఎండలు మెండుగా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. రబీ సాగు ఆశాజనకంగా ఉందని మాసూళ్ల పనులు చురుగ్గా జరుగుతున్న తరుణంలో వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల అకారణంగా శనివారం కురిసిన వర్షాలు, ఈదురు గాలులతో అన్నదాతకు ముచ్చెమటలు పట్టించాయి. గంపెడాశతో రబీ ఫలసాయం కోసం ఎదురుచూస్తున్న వేళ వాతావరణం పరిస్థితులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రెండు గంటల పాటు ఏకధాటిగా జోరుగా వర్షం కురవడంతో తమ పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు తీశారు. రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో సుమారు 74 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. అధికశాతం విస్తీర్ణంలో వరికోత యంత్రాలను వినియోగిస్తుండటంతో తేమశాతాన్ని తగ్గించుకునేందుకు ధాన్యాన్ని పొలాల్లోను, రోడ్ల వెంబడి ఆరబెట్టుకున్నారు. వారం రోజుల క్రితం ఇదే విధంగా ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాల వల్ల పలువురు అన్నదాతలకు తీవ్రనష్టం వాటిల్లింది.



ఆత్రేయపురం వర్షపు నీటిలో ధాన్యపు రాశి

మధ్యాహ్న సయయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి కారుమబ్బులు కమ్ముకుని భారీవర్షం కురవడంతో పలు గ్రామాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కొత్తపేట నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 60 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. అక్కడక్కడా విత్తనాల వరితో పాటు 10 శాతం కూలీలతో కోతలు కోయిస్తుండగా 90 శాతం మేర మెషీన్ కోతలు కోయిస్తున్నారు. మరో నాలుగు రోజులు వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



ఆలమూరులో ఆరబెట్టిన ధాన్యంపై ఉరుకులు, పరుగులతో బరకాలు కప్పుతున్న రైతులు



ఈదురుగాలులతో కూడిన వర్షపు జల్లులు

ప్రపంచ మేధావి అంబేడ్కర్

అంబాజీపేట: దేశ భవిష్యత్తును నిర్ణయించిన గొప్ప నేత, మహా మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులు అన్నారు. అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ముక్కామల బుద్ధనగర్, ఇరుసుమండ కొత్తకాలనీలో గ్రామస్తులు, మహిళా సంఘాలు అంబేడ్కర్ యూత్, యువసేన, పెద్దల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మాజీ సర్పంచ్ దేవరపల్లి చినబాలయోగి అధ్యక్షతన శనివారం జరిగింది. మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడికీ రక్షణ, హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రచించిన మేధావి అంబేడ్కర్ అన్నారు. దేశానికి దశ, దిశ చూపిన స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ అని ఆయన ఆశన సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అంతకుముందు అంబేడ్కర్ యూత్, యువసేన, పెద్దల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. తమ కాలనీలో అంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరడంతో మంత్రి విశ్వరూప్ స్పందించి కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ అక్కిశెట్టి నాగమణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీలు బుడితి సత్యనారాయణమ్మ, వనచర్ల విజయదుర్గ, కుసుమ వెంకటేష్, సొసైటీ అధ్యక్షులు నాగాబత్తుల సత్యానందరావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కోట హనుమంతరావు, చిన్నం బాలవిజయరావు తదితరులు పాల్గొన్నారు.



ఇరుసుమండ న్యూ కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే చిట్టిబాబు

విద్యా రంగానికి మౌలిక సదుపాయాలు

మామిడికుదురు: విద్యా రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గోగన్నమఠం ప్రాథమికోన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు పాల్గొన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, గురువులు, దాతలను ఘనంగా సన్మానించారు. వారికి షీల్డులు అందించి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వరప్రసాదరావు మాట్లాడుతూ పూర్వం చదువు కోసం ఎంతో దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ విద్యను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. గోగన్నమఠం యూపీ స్కూల్ నూరేళ్ల పండగ నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం బావిశెట్టి నాగేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు భూపతిరాజు లక్ష్మి, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ సాగి నర్సింహవర్మ, పీఎంసీ కమిటీ చైర్మన్ వాతాడి సూరిబాబు, ఎంఈఓ కోన హెలీనా, భూపతిరాజు సత్తిబాబురాజు, మాజీ సర్పంచ్‌లు చిగురుపాటి పెద్దిరాజు, భూపతిరాజు ఆంజనేయరాజు, సాగి సత్యనారాయణరాజు స్థానికులు పాల్గొన్నారు.



దాతలు, పూర్వ ఉపాధ్యాయుల సన్మానంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

అంగన్‌వాడీలు మెరుగైన సేవలందించాలి

మామిడికుదురు: అంగన్‌వాడీలు చిన్నారులకు మెరుగైన విద్య అందించడంతో పాటు బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిధిలోని ఏడుగురిని ఆయాలుగా, ఒకరిని మినీ వర్కర్‌గా నియమించారు. వారికి చిట్టిబాబు నియామక పత్రాలు అందించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి చూపుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిట్టిబాబు సూచించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ, ముమ్మిడివరం ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ టి.తులసీకుమారి, సూపర్‌వైజర్లు ఎస్.సుబ్బలక్ష్మి, పి.విజయలత, వీఎస్‌వీ మహాలక్ష్మి, కె.విజయగౌరి పాల్గొన్నారు.



నగరంలో ఉద్యోగులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

జగన్ ప్రభుత్వంలో తాగునీటి సమస్యకు చెక్

మలికిపురం: సీఎం జగన్ ప్రభుత్వంలో రాజోలు దీవిలో తాగునీటి సమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టగలిగామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని గుడిమెళ్లంక ప్రధాన రిజర్వాయర్ వద్ద 14వ ఆర్థిక సంఘం నుంచి వెచ్చించిన రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన 5 ఎంఎల్‌టీ ర్యాపిడ్ ఫిల్టర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ పూర్తిగా సముద్ర తీరంలో ఉన్న రాజోలు దీవిలో ఎక్కడ తవ్వినా బావులలో సైతం ఉప్పునీరు వస్తుందని దీంతో తాగునీటి కోసం ప్రజల పూర్వం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.కోట్లు వెచ్చించి తాగునీటిని అందించారని అన్నారు. గత మూడేళ్లగా సుమారు రూ.100 కోట్లకు పైగా నిధులను తాగునీటి కోసం రాజోలు దీవిలో జగన్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, మంగెన సింహాద్రి, సర్పంచ్‌లు నల్లి విజయకుమారి, నక్కా రామారావు, గుబ్బల మనోహర్, కూనపరెడ్డి రాంబాబు, గుబ్బల వీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, నాయకులు కందుల విజయకుమార్, చింతా రాజబాబు, అశోక్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



గుడిమెళ్లంకలో తాగునీటి ర్యాపిడ్ ఫిల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

వేసవి జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలి

అంబాజీపేట: అధిక ఉష్ణోగ్రతలు నేపథ్యంలో ప్రతి ఉపాధి కూలీ వేసవి జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి పనులు చేయాలన్నారు. మస్టర్లను, పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, మైలా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి అంగీకారం

మామిడికుదురు: ఆదుర్రు బుద్ధ విహార్ ట్రస్టు అధినేత ఎస్ఎస్ఆర్ భూపతి మరణానంతరం అవయవదానానికి శనివారం రిజిస్ట్రేషన్ చేశారు. భూపతి 74 వసంతాలు పూర్తి చేసుకుని 75వ ఏట అడుగు పెట్టారు. బుద్ధ విహార్ ట్రస్టులో జరిగిన సమావేశంలో విశాఖపట్నానికి చెందిన ఆంధ్రప్రదేశ్ బాడీ డోనర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు తన అంగీకార పత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మట్టా వెంకట్రావు, కోనసీమ జిల్లా కార్యదర్శి కేవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈవీవీ సత్యనారాయణ, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, బుద్ధ విహార్ ట్రస్టు ప్రతినిధులు పులపర్తి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దాతల సహకారం వినియోగించుకోవాలి

అంబాజీపేట: టీబీ వ్యాధిగ్రస్తులకు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగపర్చుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబులు అన్నారు. పుల్లేటికుర్రు సచివాలయం వద్ద రూరల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టీబీ రోగులకు నిత్యావసరాలు, గుడ్లను ఉచితంగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యు.సురేష్, కార్యదర్శి వి.త్రిమూర్తులు, ట్రెజరర్ యు.ప్రసన్న తదతరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వితరణ

సఖినేటిపల్లి: గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ వితరణ చాటుకున్నారు. గ్రామానికి చెందిన తోటి వలంటీర్ దిడ్ల అభిషేక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. అతని చికిత్స కొరకు తోటి వాలంటీర్లు రూ.60 వేలు సమకూర్చి శనివారం అందించారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ద్వారా ఈ నగదును అభిషేక్ బంధువులకు అందించారు, దాతృత్వం చాటుకున్న సిబ్బంది, వలంటీర్లను సర్పంచ్ అభినందించారు. కార్యక్రమంలో వలంటీర్లతో పాటు కుసుమ చింటు, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల తనిఖీ శనివారం జరిగింది. తహసీల్దార్ ఐపీ శెట్టి నేతృత్వంలోని అధికారుల బృందం మడికి, బడుగువానిలంక, చొప్పెల్ల తదితర గ్రామాల్లో పర్యటించారు. నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వీఆర్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

పి.గన్నవరం: బెల్లంపూడి గ్రామ సచివాలయానికి మహాలక్ష్మి ఫౌండేషన్ అధ్యక్షురాలు, సర్పంచ్ బండి మహాలక్ష్మి, ఫౌండేషన్ సభ్యుడు బండి రమేష్‌లు శనివారం రూ.11,500ల విలువైన వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వస్తున్న ప్రజల కోసం దీనిని ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ మహాలక్ష్మి తెలిపారు. మహాలక్ష్మి ఫౌండేషన్‌ను పలువురు అభినందించారు.

బూత్ కమిటీలతో బీజేపీ బలోపేతం

మామిడికుదురు: బీజేపీని బలోపేతం చేసేందుకు బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నగరం, మొగలికుదురు గ్రామాల్లో శనివారం జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఆ రెండు గ్రామాల్లోను బూత్ కమిటీ కన్వీనర్లతో కలిసి 11 మంది సభ్యులతో పూర్తిస్థాయిలో కమిటీలను నియమించారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, బండారు పళ్లంరాజు, ఆకుల రాము, రమణ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- చెముడులంకలో గడప గడపకూ..

ఆలమూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజల్లో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో తుదివిడత గడప గడపకూ కార్యక్రమం శనివారం జరిగింది. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు సీఎం జగన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు దూసుకెళుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. సుమారు రూ.రెండు కోట్లతో గ్రామంలో నిర్మించిన మేజర్ డ్రైనేజీ వ్యవస్థ వల్ల దశాబ్దాల కాలంగా పడుతున్న ఇబ్బందులు తీరాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ డ్రైనేజీ నిర్మాణానికి కారకులైన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డికి సర్పంచ్ తమ్మన నేతృత్వంలోని పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. గ్రామంలోని మహిళలందరికీ వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.6.68 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు జగ్గిరెడ్డి వివరించారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంఏఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు దంగేటి చంద్రకళ, వనుం చిన్నావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, దొండపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.



చెముడులంకలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

విమర్శలు లేని పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో విమర్శలు లేని పాలనను అందిస్తున్నారని, ఇది ఆయన వల్లే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతోందని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. శనివారం మండలంలోని నల్లచెరువులో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, స్థానిక అధికారులు సేవలు సక్రమంగా అందిస్తున్నారా? అని అడిగారు. ఏవరైనా అవినీతికి పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు విమర్శించేందుకు వీలులేని విధంగా సీఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, చిలువూరి నరసింహరాజు, వేటుకూరి సుబ్బరాజు, గుత్తుల నాగబాబు, కమిడి వెంకటేశ్వరరావు, కాశి వీవీ సత్యనారాయణ, పితాని వెంకటేశ్వరరావు, మేడిశెట్టి శ్రీను, గుత్తుల శ్రీరామ్మూర్తి, మట్టపర్తి రామారావు తదితరులు ఉన్నారు.

పాఠశాల ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం

కొత్తపేట: తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకం బాధ్యతతో పాటు వారి విద్య, పాఠశాల ప్రగతిలో కూడా తమ భాగస్వామ్యం వహించాలని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ సూచించారు. 2022-23 విద్యా సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులతో హెచ్ఎంల అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. మండలంలోని మోడేకుర్రు మెయిన్ ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం ఎం.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈఓ హరిప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తన సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థుల ప్రగతిని విశ్లేషించి వివరణాత్మకంగా నివేదికలను సమర్పించారు.

విజయవంతంగా జగనన్నే మా భవిష్యత్తు

రావులపాలెం: కొత్తపేట నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మెగా సర్వే తుది ఫలితాలను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలు సర్వేలో పాల్గొనగా జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా 1.1 కోట్ల పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని తెలపడానికి గర్విస్తున్నామన్నారు. మెజారిటీ ప్రజలందరూ జగనన్నే మా భవిష్యత్తు అని మద్దతు తెలిపారన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 69,703 మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. నియోజకవర్గంలో 1,05,503 కుటుంబాలు ఉండగా, 87.12 శాతం కుటుంబాలను అనగా 91,918 కుటుంబాలను సర్వే చేయగా 69.12 శాతం మిస్డ్ కాల్ ఇచ్చి మద్దతు తెలిపారన్నారు. క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ క్యాడర్ నిబద్ధత, పట్టుదలతో పనిచేసి ఈ సర్వేని పారదర్శకంగా నిర్వహించారన్నారు. దేశంలోనే ఏ రాజకీయ పార్టీ చేపట్టలేని అతిపెద్ద పబ్లిక్ సర్వేగా ఇది నిలిచిందన్నారు. రాష్ట్ర సమగ్ర అభివద్ధికి, ప్రజల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు కుడుపూడి శ్రీనివాసరావు, గూడపాటి రమాదేవి, బోనం సాయిబాబు, ఎంపీపీలు మార్గన గంగాధరావు, తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ కర్రి గోవిందకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

అయినవిల్లి: పి.గన్నవరం నియోజకవర్గంలోని 83,633 ఇళ్లకు గాను 75,622 ఇళ్లకు గృహసారథులు, వలంటీర్లు, స్థానికంగా వైఎస్సార్ సీపీ నాయకులతో నేరుగా జగనన్నే మా భవిషత్ కార్యక్రమంలో భాగంగా వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజా అభిప్రాయాన్ని సేకరించామని వారు 70 వేల మిస్డ్ కాల్స్ చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం సిరిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి ప్రజాభిప్రాయ సేకరణ ఎటువంటి ప్రభుత్వం చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో కోటి 45 లక్షల ఇళ్ల ఉండగా కోటి 10 లక్షలు ఇళ్లకు చెందిన వారు మిస్డ్ కాల్స్ చేసి సీఎంకు తమ మద్దతు తెలిపారు. పార్టీ అయినవిల్లి మండల అధ్యక్షుడు మట్టపర్తి శ్రీనివాస్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, నంబూరి వెంకటరమణరాజు, సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి, పార్టీ నాయకులు మట్టపర్తి పండు, కుడుపూడి విద్యాసాగర్, దొమ్మేటి దుర్గారావు, వార జయసావిత్రి, కుసుమ సునీల్ కుమార్, యడ్ల కిరణ్ తదితరులు ఉన్నారు.



రావులపాలెం విలేకరుల సమావేశంలో సర్వే ప్రతులను చూపిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఎయిరో విజన్ శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు

కొత్తపేట: ఎయిరో విజన్ ద్వారా శిక్షణ పొంది ఎయిర్ లైన్స్‌లో ఉపాధి అవకాలు పొందాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో అరుణ్‌కుమార్ అధ్యక్షతన ఎయిరో ఏవియస్ ఇండస్ట్రీ ద్వారా ఉపాధి అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిరో ఏవియస్ కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ సత్తార్ శిక్షణ ఉపాధి అవకాశాల గురించి వివరించారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన విద్యార్థులకు ఎయిర్‌లైన్స్‌లో వివిధ స్థాయి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. తమ కంపెనీలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు ఇప్పిస్తామన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి 3, 6 నెలల శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్హత, అనుభవాన్ని బట్టి రూ.20 వేలు నుంచి జీతాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిరో ఏవియస్ హెచ్ఆర్ సుభద్ర, ట్రైనర్ సాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు వెంకన్న కల్యాణం

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటివారి పాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మే 1న స్వామి వారి తీర్థం నిర్వహించనున్నామన్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలి వచ్చి వెంకన్న ఆశీర్వాదాలు స్వీకరించాలన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ఆత్రేయపురం: నాడు-నేడు రెండో దశ పనుల్లో భాగంగా పాఠశాలల్లో మేజర్, మైనర్ రిపేర్లు ఉన్న వాటికి ప్రాధాన్యమిచ్చి తక్షణమే పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో నాతిబుజ్జి తెలిపారు. ఆమె శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో 36 ప్రాజెక్టులపై ఏఏ కాంపోనెంట్ పనులు ఎంతవరకు పూర్తి చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ ఎం.ఆనందరాజు, ఎంఈవో వరప్రసాద్, హౌసింగ్ ఏఈ వి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సందర్భంగా రూ 63.5 లక్షలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నేతాజీ కాన్వెంట్ పక్కన రూ 43.5 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-2 భవనాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రూ.20 లక్షలతో ఎస్సీ ఏరియాలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందజేశారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు నాగిరెడ్డి సత్యనారాయణ, బుడ్డిగ వీర వెంకట్రావు పాల్గొన్నారు.